“సరిగ్గా అర్థరాత్రి ఒంటిగంటకు సరుకు తీసుకుని బయలుదేరు. తూర్పు రోడ్‌గుండా నగర సరిహద్దుల్ని దాటు.”

డ్రైవర్ సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

“మధుమూర్తి యస్.పి బంగ్లాకి ఫోన్ కలుపు” అన్నాడు పట్టాభి చిరునవ్వు పెదాలమీద కదలాడుతుండగా.

ఎందుకో అర్థంకాని మధుమూర్తి ఎస్.పి.బంగ్లాకి ఫోన్ కలిపి పట్టాభికందించాడు.

పట్టాభి ఫోన్‌ని చటుక్కున చేతిలోకి తీసుకుని సుందరమ్మ పైటకొంగును మౌత్‌పీస్‌కి అడ్డంగా పెట్టి కొద్దిక్షణాలు వెయిట్ చేశాడు.

“హలో యస్.పి.గారేనా. నేను ఇన్‌ఫార్మర్‌ని. ఈ రాత్రి సరిగ్గా ఒంటిగంటకు ఓ లారీ దొంగసారాతో తూర్పువేపు రోడ్‌గుండా నగర సరిహద్దుల్ని దాటుతోంది” పట్టాభి ఫోన్‌కట్ చేసేశాడు.

మధుమూర్తి, సుందరమ్మ మిగతా ఇద్దరూ షాక్ తిన్నారు.

“అదేంటలా చేశావు? వాడసలే డేంజరస్. తెలిసీ ఇన్‌ఫఫర్మెషన్ అందించేశావేంటి? వాడు కాపుకాసి లారీని నొక్కేస్తే నాలుగులక్షలు నష్టం” మధుమూర్తి చికాకుడ్డాడు.

పట్టాభి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు కొనసాగుతూ క్రమంగా పెద్దదయిపోయింది. ఉన్నట్టుంది చటుక్కున నవ్వాపి “ఈ పట్టాభి స్ట్రాటజీ నీకు ఇప్పటివరకు కూడా తెలియకపోవటం వెరీ బాడ్. వేచిచూడు ఏంజరుగుతుందో?” అన్నాడు పట్టాభి జరగనున్న సంఘటనను ఊహించుకుంటూ. అప్పటికి మధుమూర్తికేం అర్థం కాలేదు.

“ఉష ఎవరు?” పట్టాభి వున్నట్టుండి అడిగాడు.

“ఎవరో జర్నలిస్టు” అన్నాడు మధుమూర్తి పెద్దగా ఇంపార్టెన్స్ యివ్వకుండా.

“ఎవరో జర్నలిస్టు అంటావేం? ఆ పిల్లేకదా నాగురించి నా కంపెనీగురించి చెడుగా రాసింది” సుందరి కోపంగా అంది.

పట్టాభి లయబద్ధంగా తలూపుతూ “ఒక పట్టు పట్టమని మనవాళ్ళకు చెప్పు” కూల్‌గా అన్నాడు పట్టాభి .

ఆ మరుక్షణం నలుగురు మనుష్యులు ఉష పనిచేసే పత్రికకేసి సాగిపోయారు.

“అగ్నికి ఆజ్యం తోడు కారాదు. ఆ యస్.పి.కి ఈపిల్ల తోడు కారాదు. పత్రికలకు సాధ్యమైనంత దూరంగా వుండటం క్షేమం” అన్నాడు పట్టాభి సుందరిని తీసుకుని బెడ్‌రూమ్‌కేసి వెళుతూ.

“ఇదేంటిలా చేస్తున్నాడు పట్టాభి-మంత్రులకు మెంటల్ వస్తుందంటే నేనిదివరకు నమ్మేవాడ్ని కాదు. ఫోన్‌చేసి మరీ చెప్పేసాడు మన వేధవపని” మధుమూర్తి పట్టాభి, సుందరి వెళ్ళినవేపుకేసి కసిగా చూస్తూ అన్నాడు. ప్రక్కనున్నవాళ్ళేం మాట్లాడలేదు.

అతని కోపానికి అదొక్కటే కారణం కాదు-తన కళ్ళముందే సుందరిని దగ్గరకు తీసుకుని

లోనకు వెళ్ళటం కూడా కారణమైంది.

0 0 0

పట్టాభి పంపిన ఇద్దరు వ్యక్తులు ఉష పనిచేసే పత్రికాఫీసుకు వందగజాల దూరంలో వున్నారిప్పుడు.

అప్పుడు సమయం రాత్రి పదిగంటలు.

స్ట్రీట్‌లైట్ నీడలోవున్న ఆ ఇద్దరు వ్యక్తులూ కళ్ళు చిట్లించుకుని చూస్తున్నారు ఉషకోసం.

అంతకుముందే ఆ ఇద్దరిలో ఒకరు పత్రికాఫీసుకు ఫోన్ చేయగా ఉష డ్యూటీలో వుందని, పదికి డ్యూటీ పూర్తవుతుందని తెలిసింది. ఆ సమయం కోసమే ఇద్దరూ వేటకుక్కల్లా ఎదురుచూస్తున్నారు. మరి కొద్దినిమిషాలు గడిచాయి.

అప్పుడు ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి బయటకి వచ్చింది ఉష. ఆ ఇద్దరు వ్యక్తులు ఆలర్టు అయిపోయారు.

"అందులో ఆ అమ్మాయెవరు?" ఒకడు మరొకడ్ని అడిగాడు.

"దగ్గరగా నడుద్దాం పద... చెబుతాను" అంటూ అతను ముందువారికి అనుమానం రాకుండా నడకలో వేగం పెంచాడు.

అలా పావుగంట గడిచింది. అంతలో ఉషవాళ్ళు చటుక్కున ఒక ఆటో ఎక్కేసారు. ఊహించని ఆ పరిణామానికి ఈ ఇద్దరూ ఒకింత కలపరపడి తాము మరో ఆటో ఎక్కేశారు.

అప్పుడు రాత్రి పదిన్నర కావస్తోంది. ఉష ఒంటరిగా దొరికితే బెదిరించవచని ఇద్దరు వ్యక్తులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నట్టుంది ఓచోట ఆటో ఆగింది.

అందులోంచి ఉషా ముద్దుకు సగిపోయింది.

"ఇప్పుదు ఒంటరిగా వుంది. ఓ పట్టు పడదామా?" అన్నాడు ఇద్దరిలో ఒకడు ఆటోలోంచి దిగుతూ.

"అదిగో, అమె ఇప్పుడు వెళ్తున్న హోటల్‌లోనే గతంలో ఒకసారి సుందరమ్మగారు పంపగా ఆమెమీద ఎటాక్ చేయబోయింది"

"సర్లే, ముందు త్వరగా పద... పట్టాభిగారి పని వెంటనే చేసేస్తే మనకు ఎమ్.ఎల్.ఏ. సీటయినా రావచ్చు."

రెండో వాడు ఆశ్చర్యపోయాడు "అలా వెళ్ళే నలుగురం తన్నులు తినొచ్చాం. కాస్త ముందూ వెనుకా చూసుకెళ్ళటం మంచిది. అయినా మనం మంత్రిగారికి ఎంత సహాయపడినా మనకెలా సీటిప్పిస్తారు. మనకేం అర్హతుంది?"

"ఇదే"

"అంటే?"

"రౌడీయిజం"

రెండోవాడు కొద్దిక్షణాలు విస్తుపోయాడు.

ఆ ఇద్దరూ వారి సంభాషణను కట్టిపెట్టి మరికాస్త ముందుకు వెళ్ళారు. అందులో ఒకడు ఆ కాకా హోటల్‌లోకి చూస్తూనే షాక్ తిన్నాడు. అక్కడ ఉదయ్‌తో ఉష మాట్లాడుతోంది.

వాళ్ళలా చూస్తుండగానే ఉష బయటకు వేలు పెట్టి చూపించటం, ఆ వెంటనే ఉదయ్ విసురుగా బయటకు రావటం చూసి ఇద్దరిలో ఒకడు పరుగు లంకించుకున్నాడు. అదిచూసి రెండోవాడు కూడా పరుగు లంకించుకున్నాడు.

అర్ధరాత్రి కావటానికి మరో అయిదునిమిషాలే వుంది.

ముందు యుగంధర్ కారు, వెనుక సర్కిల్ జీపు, ఆ వెనుక పోలీసు వ్యాను బయలుదేరటానికి సిద్ధంగా వున్నాయి. యుగంధర్ చాలా పట్టుదలగా వున్నాడు.

తొలి ప్రయత్నంలోనే తను దెబ్బతినకూడదు. అది జరిగితే పట్టాభి రెండోసారి విజయం సాధించినట్లవుతుంది. అంతకంటే అవమానం మరోటి వుండదు.

ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ తొలి అవకాశాన్ని చేజార్చుకోకూడదు.

యుగంధర్ వారికేసి చూసుకుని డ్రయివర్‌వేపు చూస్తూ తలెగరేశాడు.

అంతే... ఆ మరుక్షణం యుగంధర్ కారు నగర తూర్పు సరిహద్దు వేపుకు దూసుకుపోయింది. ఆ వెనుకే జీప్, వ్యాన్ ఫాలో అయ్యాయి.

ఇప్పుడా వ్యాన్, జీప్‌లోవున్న పోలీస్ సిబ్బందికి ప్రాణసంకటంగా వుంది.

పట్టాభి, మధుమూర్తి వాహనాల్ని ఆపి తనిఖీ చేయటమంటే కొరివితో తల గోక్కోవటమే అవుతుంది.

యుగంధర్ ఉండుండి సైడ్ సేఫ్టీ వాలెట్‌లోవున్న పిస్టల్‌ను తడుముకుంటున్నాడు.

ప్రక్కనేవున్న సిబ్బందికి టెన్షన్‌గా వుంది.

సరిగ్గా అదే సమయంలో లారీ లోడింగ్ పూర్తయింది. మధుమూర్తి టెన్షన్‌లో వున్నాడు.

ఏ క్షణాన ఫోన్ వస్తుందో? అందులో ఏ మెసేజ్ వస్తుందో? ఏ హెచ్చరిక వస్తుందో? అని అనీజీగా గెస్ట్‌హౌస్‌లో పచార్లు చేస్తున్నాడు.

లోపల ఏ.సి. గదిలో పట్టాభి అలసిపోయి సుందరి మీదనుంచి ప్రక్కకు జారాడు రిలాక్స్‌డ్‌గా.

0 0 0

"పారిపోయారు వెధవలు...." అంటూ వెనుదిరిగి ఉష ఉన్న దగ్గరకు వచ్చాడు ఉదయ్, అమె యింకా భయపడుతూనే వుంది "ఎందుకిలా నీవెంట పడుతున్నారు? ఆ ఫైనాన్స్ కంపెనీ గురించి చెడుగా వ్రాసినందువల్లనేనా? లేక వేరే కారణం వుందా?" ఉదయ్ బల్లమీద కూర్చుంటూ అడిగాడు.

"అదీ ఒక కారణం కావచ్చు?" అందామె మెల్లగా.

"అంటే వేరే ఇంకో కారణం కూడా వుందా?"

"ఉంది. నిన్నే మధుమూర్తి, పట్టాభిల ఫైనాన్స్ కంపెనీ ఓపెన్ అయింది. ఎవరో ఒక అనామకుడి పేరుమీద కంపెనీని స్థాపించారు. త్వరలో ఈ ఊర్లోని మధ్యతరగతి ప్రజల్ని దారుణంగా ముంచే ప్రయత్నంలో వున్నట్లు నా అంచనా. ప్రజల్ని మభ్యపెట్టటానికి, ప్రలోభపెట్టడానికిగాను ఒక మారుతీ కారు లాటరీకి పెట్టి, ఆది వారి మనిషికే వచ్చేలా చేశారు. నా అనుమానాన్ని కొత్త ఎస్.పి. యుగంధర్‌కి తెలియపర్చాను.

ఆయన ప్రొసీజర్ ప్రకారం నేను ఓరల్ కంప్లయింట్ ఇచ్చినట్లు చెప్పి లాటరీ విధానాన్ని చెక్ చేశారు. దాంతో తిరిగి నన్ను బెదిరించే ప్రయత్నం చేశారని నా అనుమానం--" అంది ఉష మంచినీళ్ళ గ్లాసు తీసుకుంటూ.

"ఎందుకు, ఎందుకివన్నీ చేస్తున్నావ్ నువ్వు?" ఉదయ్ ఆశ్చర్యపోతూ అడిగాడు.

ఆమె ఓసారి తలెత్తి ఆశ్చర్యంగా ఉదయ్‌కేసి చూసింది. ఆమె విశాలమైన కళ్ళు కొద్ది క్షణాలు మరింత విశాలమయ్యాయి.

"మంచి కోసం. నేను జర్నలిస్టుని. సమాజంలో జరిగే అవకతవకల్ని బయటపెట్టడమే జర్నలిస్ట్ ఆశయం" అంది ఖాళీ గ్లాసు బల్లపై పెడుతూ.

"కొత్త ఎస్.పి ఎప్పుడు డ్యూటీలో జాయిన్ అయ్యారు?"

"నిన్ననే, ఏం అలా అడిగావు?"

"ఏం లేదు" అన్నాడు ఎటో చూస్తూ.

"ప్రస్తుతం ఏం చేస్తున్నావ్...?"ఆమె తిరిగి అడిగింది.

"ఏం చేయాలో తోచక ఖాళీగా కూర్చున్నాను"

"ఏదయినా ఉద్యోగం దొరికితే చేస్తావా?"

ఉష మాటలకు చటుక్కున తలెత్తి చూశాడు ఉదయ్.

"నిజంగానే అడుగుతున్నాను" అంది ఆమె స్థిరంగా.

"చేస్తాను" అన్నాడు ఆమెకేసి వింతగా చూస్తూ.

"జీతం ఎంత కావాలి?"

"బతకగలిగినంత."

"నాకు జీతం రెండువేలు. అందులో సగం నీకిస్తాను- చేస్తావా?"

ఆమె అన్న మాటలు అర్థంకాక అయోమయంగా చూశాదు.

"ఎస్. నాకిప్పుడు రక్షణ కావాలి. అది నువ్వు నాకు కల్పించాలి. అందుకుగాను నీకు నెలకు వెయ్యి ఇస్తాను" అందామె అతని సమాధానం కోసం ఆతృతగా ఎదురుచూస్తూ.

అతను మౌనంగా వున్నాడు.

సర్కిల్ ఇచ్చిన మాటప్రకారం తనాశించిన అడ్రస్ ఈపాటికే ఇవ్వాలి. కాని ఇంతవరకూ అడ్రస్ లేడు, ఈమె చెబుతున్న మాటల ప్రకారం సర్కిల్ ఆశించిన పని జరిగిపోయిందని తెలుస్తోంది.

తన పని యింతవరకూ జరగలేదంటే సర్కిల్‌ని అనుమనించాలా?

సర్కిల్ నిజాయితీపరుడిలాగే వున్నాడు. తన ఇంటి అడ్రస్ దొరకటానికి టైమ్ పడితే...ఇప్పటివరకూ తనెలా బ్రతకాలి.

కనుక ఆమె యిస్తానన్న ఉద్యోగం చేయటమే మంచిదేమో?

ఉదయ్ ఆలోచనల్లో పడ్డట్టు ఉష పసిగట్టి అతని సమాధానం కోసం ఆశగా ఎదురుచూస్తోంది.

క్షణాలు, నిమిషాలు దొర్లిపోతున్నాయి.

"బాబూ! ఆ అమ్మాయిని పంపిచేస్తే మనం బంక్ కట్టేసి పడుకోవచ్చు" అన్నాడు బంకు యజమాని ఆవులిస్తూ.

అతని మాటలకు ఆలోచనల్లోంచి తేరుకున్నాడు ఉదయ్ "ఈ అమ్మాయిని వాళ్ళింటిదగ్గర దింపివస్తాను" అంటూ ఆమెను బయలుదేరమన్నట్లుగా చూస్తూ లేచాడు.

ఆమె మోము ఒక్కసారి ఆనందంతో వెలిగిపోయింది.

"అంటే ఈ క్షణం నుంచే ఉద్యోగంలో చేరుతున్నావా?" ఉష లేస్తూ అంది.

అతను అవుననట్లు తలూపుతూ బంకునుంచి బయటకు వచ్చాడు.

ఇద్దరూ చీకట్లో బయలుదేరారు.

0 0 0

అర్థరాత్రి దాటి అరగంటయింది. తూర్పువేపు రహదారిపై పూర్తి నిఘా వేశాడు యుగంధర్ .

ఆ నిశీధి నిశ్శబ్దంలో రోడ్డు ప్రక్కనున్న పొదల వెనుక దాగివున్న పోలీసు సిబ్బంది ఎస్.పి. విజిల్ కోసం ఎదురుచూస్తున్నారు.

వారికి ఓ ప్రక్క వృత్తిధర్మం, మరోప్రక్క యిద్దరు ప్రమాదకరమైన వ్యక్తులను ఎదుర్కోబోతున్న ఉద్విగ్నత, ముందు నుయ్యి వెనుక గొయ్యిలా వుంది ప్రస్తుతం వారి స్థితి.

క్షణాలు, నిమిషాలు భారంగా దొర్లిపోతున్నాయి.

అర్థరాత్రి ఒంటిగంట కావటానికి మరో నిమిషమే వుందనగా దూరంగా హెడ్‌లైట్స్ మిణుకు మిణుకుమంటూ కనిపించాయి. అవి క్రమంగా దగ్గరవుతూ పెద్దవవుతున్నాయి.